పాఠశాలపై ప్రేమతో..

- సొంత నిధులతో పాఠశాలలో పలు అభివృద్ధి పనులు
- ఆదర్శంగా నిలుస్తోన్న ఉపాధ్యాయుడు ఫణికుమార్


చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల అదనపు భవనానికి సొంత నిధులతో రంగులు వేయించిన ఫణికుమార్

తోటపల్లిగూడూరు : ఉన్నంతలో తన పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ఊరిలో ఉన్న వారికి విద్యాబుద్ధులు నేర్పేందుకు కృషి చేస్తున్నారు ఉపాధ్యాయుడు సీహెచ్‌వీ ఫణికుమార్. మంచి మాస్టారు ఉంటే ఆ పాఠశాల ఎలా అభివృద్ధి చెందుతుందో చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలను చూస్తే అర్థం చేసుకోవచ్చు.

పూర్వ వైభవం దిశగా అడుగులు

తోటపల్లిగూడూరు మండలంలోని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలకు ఘన చరిత్ర ఉంది. తీరప్రాంత పంచాయతీ అయిన కోడూరు మజరా గ్రామాల్లో చెన్నపల్లిపాళెం ఒకటి. ఇక్కడి ఉన్నత పాఠశాల 575 మంది విద్యార్థులతో జిల్లాలోని పెద్ద పాఠశాలల్లో ఒకటిగా ఉంది. అంతేకాకుండా జిల్లాలోనే మత్స్యకార వర్గాల పిల్లలు అధికంగా విద్యనభ్యసిస్తున్న ఉన్నత పాఠశాల చెన్నపల్లిపాళెంలోనే ఉంది. 2016 వరకు కనీస వసతుల్లేకుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడేవారు. 2017న జూన్‌లో బదిలీపై పాఠశాలకు వచ్చిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఫణికుమార్ తన సొంత నిధులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, దాతల సహకారంతో నిధులను సమకూర్చి అన్నివిధాలా పాఠశాలకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తున్నారు.

సంతోషంగా ఉంది



“పాఠశాలలో విద్యార్థులకు చక్కటి సౌకర్యాలను కల్పించడంతో పాటు పేద పిల్లలకు కార్పొరేట్ తరహాలో విద్యాబోధన అందించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నా. అందువల్లే సొంత నిధులతో పాటు స్థానికులు, దాతల సహకారంతో చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలకు పూర్వవైభవాన్ని తీసుకొస్తున్నా. పాఠశాల అభ్యున్నతికి ఖర్చుపెడుతున్న ప్రతి రూపాయిలోనూ సంతోషం కన్పిస్తోంది.

– ఫణికుమార్, ఉపాధ్యాయుడు, చెన్నపల్లిపాళెం

చేపట్టిన పనులు..

- 2017–18 విద్యాసంవత్సరంలో రూ.60 వేలతో 15 సీలింగ్ ఫ్యాన్లను, 30 ట్యూబ్ లైట్లను సమకూర్చారు.
- 2018–19 విద్యా సంవత్సరంలో పాఠశాల పరిశుభ్రత కోసం రూ.6 వేలు విలువ చేసే పారిశుద్ధ్య సామగ్రితో పాటు పారలు, గడ్డపారను పాఠశాలకు వితరణ చేశారు.
- పాఠశాలలోని బాలికల మరుగుదొడ్లను ప్రతి రోజూ శుభ్రపరిచేందుకు ప్రతినెలా రూ.500లను వెచ్చిస్తున్నారు.
- స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్రతి విద్యా సంవత్సరం నోట్‌పుస్తకాలు, ఇతర సామగ్రిని అందిస్తున్నారు.
- ప్రాథమిక పాఠశాలల నుంచి చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేరికకు ప్రోత్సాహకంగా నోట్ పుస్తకాలతో పాటు దోమతెరలు, సైన్స్ మెటీరియల్స్‌ను అందిస్తున్నారు.
- పాములదొరువు కండ్రిగ, మహాలక్ష్మీపురం, వెంకన్నపాళెం, ముక్కంటమ్మ గిరిజన కాలనీల్లో ప్రతి వేసవి కాలంలో విద్యాకేంద్రాలను నిర్వహిస్తూ పలువురిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నారు.
- ప్రతి ఏటా పాఠశాలలో జరిగే బాలల దినోత్సవం, గురుపూజోత్సవం, పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటేందుకు రూ.20 వేల నగదు వితరణ చేస్తున్నారు.
- సీపీ ఆక్వా కంపెనీని ఒప్పించి పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఫణికుమార్ కృషి చేశారు.
- ఇలా ఫణికుమార్ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా రాష్ట్ర, జిల్లా స్థాయి ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలకు శిక్షకుడిగా వ్యవహరించారు. 2015లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. వీటితో పాటు అనేక అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకుని శభాష్ అనిపించుకొంటున్నాడు.


సొంత నిధులతో విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ (ఫైల్)


యోగాలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు ఫణికుమార్ (ఫైల్)

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): రంగనాయకులపేట సమీపంలోని రైల్వేగేట్ వద్ద సింగిల్ నంబర్లాడుతున్న ఇద్దర్ని సంతపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. రంగనాయకులపేటకు చెందిన కాలేషా, బాబును అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1600ను స్వాధీనం చేసుకున్నారు.

2న అర్జీల స్వీకరణ

నెల్లూరు(బారకాసు): ప్రజల నుంచి అర్జీలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆగస్ట్ రెండున స్వీకరించనున్నారని కమిషనర్ సూర్యతేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన భవన నిర్మాణాల అప్రూవల్ సంబంధిత సమస్యలు, ఇతర అంశాలను మంత్రి దృష్టికి తీసుకురావొచ్చని పేర్కొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో తనిఖీ



నెల్లూరు(అర్బన్): కపాడిపాళెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. అక్కడ నిర్వహిస్తున్న లెప్రసీ సర్వేను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్, టీబీ వ్యాధి నివారణపై చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించి లక్ష్యాలను సాధించాలని కోరారు. ఆరోగ్య కేంద్ర డాక్టర్ కల్యాణ్, డీఆర్టీబీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నెల్లూరు (టౌన్): ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మహిళా టీచర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని మంగళవారం కలిసి సమస్యలను తెలియజేశారు. మహిళా టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సరస్వతి పద్మజ, రాష్ట్ర అధ్యక్షులు ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి రాధారాణి, గౌరవ సలహాదారు సుధావాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉస్నారా తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణకు కిల్‌కారి సేవలు


మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): మాతాశిశు సంరక్షణ చర్యల్లో భాగంగా కిల్‌కారి మొబైల్ అకాడమీ సేవలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీనిపై అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య సూచించారు. సంతపేటలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశ నోడల్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు పాటించాల్సిన ఆరోగ్య రక్షణ చర్యలపై మహిళలను చైతన్యం చేసేందుకు కిల్‌కారి పేరిట వాయిస్ కాల్స్‌ను చేయనున్నారని వివరించారు. ఏఎన్ఎం వద్ద నమోదు చేసుకునే సమయంలో ఇచ్చిన నంబర్‌కు ఈ కాల్స్ వస్తాయని చెప్పారు. కాల్స్‌ను గర్భిణులు వినేలా ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు కృషి చేయాలని కోరారు. నేషనల్ టీమ్ బీసీహెచ్ కన్సల్టెంట్ రవీంద్ర, రాష్ట్ర ప్రోగ్రామింగ్ మేనేజర్ రాజు, డీఐఓ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



నెల్లూరు (టౌన్): మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ జడ్జి వాణి పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని రావూస్ డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థులతో ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ర్యాగింగ్, డ్రగ్స్, బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలను వివరించారు. ఏ అవసరమొచ్చినా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. ప్రాణరక్షణ కోసం ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. ప్రిన్సిపల్ షరీఫ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువుతోనే సమాజం బాగు


బాలికలకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లను ఆవిష్కరించిన అధికారులు

కొడవలూరు : ఆడపిల్లలు చదువుకుంటేనే కుటుంబం, సమాజం బాగుపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం హైస్కూల్‌లో 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. అదేవిధంగా గుడ్ టచ్– బ్యాడ్ టచ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా వ్యవహరిస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. అనంతరం బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి హర్షిత, హెచ్‌వీ రజియా, హైస్కూల్ హెచ్ఎం మోహన రామలింగయ్య, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లూరు టౌన్ ఈఈ బదిలీ


సోమశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)గా విధులు నిర్వర్తిస్తున్న సోమశేఖర్ రెడ్డిని బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. నెల్లూరు రూరల్ డివిజన్ ఈఈగా బదిలీ అయ్యారు.

నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న శ్రీనివాస్

నెల్లూరు(బారకాసు): నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నామని ఎన్‌హెచ్‌ఆర్జేసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆచారి వీధిలోని నూతన జర్నలిస్ట్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణే తమ సంస్థ లక్ష్యమని చెప్పారు. జిల్లా ప్రెసిడెంట్‌గా కలిమేలి పవన్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా మాలిక్‌బాషా, రూరల్ ప్రెసిడెంట్‌గా సర్వేపల్లి సునీల్‌కుమార్‌ను ఎన్నుకున్నామని చెప్పారు.

నీటిని విడుదల చేయాలని కోరాం

పొదలకూరు : శ్రీశైలం జలాశయానికి 4.30 క్యూసెక్కుల వరదనీరు వస్తోందని, డెడ్‌స్టోరేజీలో ఉన్న సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని విడుదల చేయాల్సిందిగా ఇరిగేషన్ శాఖ మంత్రి రామానాయుడును కోరినట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక మారుతీనగర్‌లోని శ్రీవీర అభయాంజనేయస్వామికి ఆయన మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం, గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ రెండురోజుల్లో నీటిని విడుదల చేస్తారన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ, పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.దామోదరరావు, గంటా సుధాకర్, ఎల్.అశోక్‌కుమార్, మస్తాన్‌బాబు, భాస్కర్‌రెడ్డి, వెంకటరత్నంనాయుడు, మల్లికార్జున్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేకపూజల్లో పాల్గొన్న సోమిరెడ్డి

ఎస్సైల బాధ్యతల స్వీకరణ


వెంకటాచలం ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వీరప్రతాప్


కొడవలూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన హనీఫ్ అహ్మద్

వెంకటాచలం : వెంకటాచలం మండల ఎస్సైగా వీరప్రతాప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్సైగా ఉన్న రాజేష్ రాజకీయ ఒత్తిళ్లతో కొన్ని రోజులుగా సెలవులో ఉన్నారు. దీంతో వీరప్రతాప్‌ను వెంకటాచలం ఎస్సైగా నియమించారు. ఈ మేరకు ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

- **కొడవలూరు :** కొడవలూరు ఎస్సైగా హనీఫ్ అహ్మద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కందుకూరులో ఎస్సైగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న వీరప్రతాప్ వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నూతన ఎస్సైను స్టేషన్ ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కలిసి అభినందనలు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటికే వైద్యసేవలు

- వైద్యాధికారి ఎం.రామకృష్ణ


వెంకన్నపురంలో వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ అన్నారు. మండలంలోని వెంకన్నపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి పలువురికి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆస్పత్రికి రాలేని వారికి ఇంటి వద్దే వైద్య సేవలందించే బృహత్తర కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ అని కొనియాడారు. దీని ద్వారా గ్రామాల్లో ఎంతో మందికి ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి నివారిస్తున్నట్లు చెప్పారు. దోమల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రాత్రిళ్లు దోమ తెరలను విధిగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ వి.రామ్మోహన్, ఎంఎల్‌హెచ్‌పీ మహాలక్ష్మి, ఏఎన్ఎం రమణమ్మ, హెచ్ఏ షఫీ ఉద్దీన్, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా నిర్మిస్తే కఠిన చర్యలు


నిర్వాహకులను హెచ్చరిస్తున్న కమిషనర్ రమణబాబు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు నిర్మిస్తే చర్యలు తప్పవని కమిషనర్ రమణబాబు హెచ్చరించారు. పట్టణంలోని రామకృష్ణానగర్‌లో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం ఆయన అక్కడికి చేరుకుని నిర్మాణాలను అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. నగర పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు వీధుల్లోని చెత్తను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఆ తర్వాత పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు.

పంటకోతపై రైతులకు అవగాహన


రైతులకు వివరిస్తున్న ఏఎస్ఓ శ్రీనివాసులు

విడవలూరు : స్థానిక రైతు సేవా కేంద్రంలో పంట కోత దశ గురించి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏఎస్ఓ ఎ.శ్రీనివాసులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ రైతులు పొలంలో వరి నాటిన మొదటి రోజు నుంచి పంట చేతికొచ్చేంత వరకు తగిన మోతాదులో మందులను వినియోగించాలని సూచించారు. వ్యవసాయాధికారుల సలహాలు తప్పక పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ కిరణ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

మనుబోలు : ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని మనుబోలు కోదండరామపురం దేవాంగుల వీధిలో కొలువైన పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు పోలేరమ్మకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన గావించి వేపాకు, వేపకాయలతో ప్రత్యేకాలంకరణ చేశారు. మంత్రోచ్చారణల మధ్య పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా గంధళ్ల శ్రీనివాసులు, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

దాతృత్వం అభినందనీయం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓలు, హెచ్ఎం తదితరులు

కొడవలూరు : యల్లాయపాళెం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సీహెచ్.శ్రీహరిరావు, మాధవి దంపతుల దాతృత్వం అభినందనీయమని ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య కొనియాడారు. మండలంలోని యల్లాయపాళెం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం దంపతుల దాతృత్వంతో శుభ్ దిన్ భోజన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన ఎంఈఓలు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిరకాల పిండి వంటలతో పిల్లలకు రుచికర భోజనం అందించిన హెచ్ఎం శ్రీహరిరావును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్‌పర్సన్ షాహిన్, ఉపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసులు, సీఆర్ఎంటీ ఎం.దయాకర్ పాల్గొన్నారు.

వరిసాగులో యాజమాన్య పద్ధతులు కీలకం


కొడవలూరు : వెంకన్నపురంలో వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ సత్యవాణి


తోటపల్లిగూడూరు : పేడూరులో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

- ఆకు ముడతను నివారించుకోండి

కొడవలూరు : వరిసాగులో ఎరువుల యాజమాన్యం కీలకమని, ఇక్కడి వరి పంటను ఆకు ముడత తెగులు ఆశించి ఉన్నందున వెంటనే నివారించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి సూచించారు. మండలంలోని వెంకన్నపురంలో సాగులో ఉన్న వరి పంటను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆకు ముడత తెగుల నివారణకు క్లోరిపైరిఫాస్, వేప నూనె కలిపి పిచికారీ చేయడం ద్వారా నివారించుకోవాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులను వినియోగించాలే తప్ప ఇబ్బడిముబ్బడిగా ఎరువులను వినియోగించరాదన్నారు. అనంతరం గ్రామంలోని కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు పంపిణీ చేశారు. ప్రతి కౌలు రైతూ విధిగా సీసీఆర్ కార్డు పొందాలన్నారు. పంటలు నష్టపోయినప్పుడు బీమా పొందాలన్నా, వ్యవసాయశాఖ రాయితీలు పొందాలన్నా, బ్యాంకులో పంట రుణాలు పొందాలన్నా, సీసీఆర్ కార్డులు ఆవశ్యమని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీ, డి.సుజాత, ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి, ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు బి.లిఖిత, ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకునల్లి, కంకినల్లిపై అప్రమత్తత అవసరం

తోటపల్లిగూడూరు : వరి పైరుకు ఆశించే ఆకునల్లి, కంకినల్లి తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మ ప్రాజెక్ట్ పీడీ శివనారాయణ సూచించారు. మండలంలోని పేడూరు గ్రామంలో వరి పొలాలను వ్యవసాయాధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆకునల్లి, కంకినల్లి విజృంభించే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆకుముడతను పిలకదశలోనే నివారించాలన్నారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి, స్థానిక వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.